

# దేవుడూ శత్రువే!

'శ్రీరాజ్'

పదిహేను సంవత్సరాల తర్వాత-మొట్ట మొదటిసారి రమణమ్మ ముఖంలో నవ్వును చూశాడు, సూరయ్య తాత. అతని గాజుకళ్ళు మెరిసిపోయాయి.

సూరయ్య తాతకి దెబ్బయ్యేళ్ళుంటాయి. రమణమ్మని చిన్నప్పట్నుంచి చూస్తున్నాడు. అప్పుడు-గలగల పారే వాళ్ళ ఊరి సీతమ్మేరు ఏరులా నవ్వుతూ, అందర్నీ నవ్వించేది. రాములవారి గుడిలో సీతమ్మ తల్లికి పెట్టిన బంగారు కిరీటం చాయతో మిలమిల మెరిసిపోయేది. పైడన్నతో కలిసి నడుస్తుంటే, సీతమ్మదేవిలా కనిపించేది. ఆ నవ్వూ, రంగూ, వయస్సూ-అన్నీ కనిపించకుండా పోయాయి, ఆమె బొట్టు చెరిగిపోగానే.

"రవనమ్మా .... నవ్వుతుందావమ్మా?

విజ్జెంగా నవ్వుతుండావమ్మా ... మా అమ్మే....ఎన్నాళ్ళకి సూత్తున్నాను నీ మొగంలో నవ్వు ... సెంద్రం బావు పెయోజకుయ్యాడు కదా మరి-నీ కష్టాలు లుండవమ్మా. ఆ దేవుడు సల్లగా సూత్తాడు." సూరయ్యతాత కళ్లు చెమ్మగిల్లాయి.

సూరయ్యతాత-రమణమ్మకి తండ్రి కాదు. బంధువు కాదు. ఏ చిన్న కష్టం వచ్చినా ఆమెను కన్న తండ్రిలా ఆదుకుంటాడు. డబ్బుతో కాకపోవచ్చు మంచి మాటతో, మంచి మనసుతో ఆదుకుంటాడు. కానీ, ఆ ముసలి మనిషికి, మంచి మనసుకి- రమణమ్మలో నవ్వు చెరిగిపోవడానికి కారణం ఆమె బొట్టు చెరిగిపోవడం అని మాత్రం తెలుసు. ఆమె పసుపూ కుంకుం ఎవరు ఎలా తుడిచారో, ఆ వెనుక దాగిన కథ ఏమిటో తెలీదు. ఈ రోజు - రమణమ్మలో కనిపించిన నవ్వుకి కారణం ఆమె కొడుకు ప్రయోజకుడయ్యాడని మాత్రమే తెలుసు. ప్రయోజకుడైన కొడుకుతో ఆమె ఏదో సాధించాలనుకుంటున్నదనీ, ఆ లోతు గుండెలో ఏ అగ్నిపర్వతం కదులుతుందో తెలీదు.

సూరయ్య తాతకి రాత్రి మిగిలిన గంజి గిన్నెలో పోసి యిచ్చింది గంజి తాగి సూరయ్య తాత వెళ్లిపోయాడు.

రమణమ్మ ఎండుపుల్లలు పొయ్యిలో కుక్కి, మంటను ఎగదోసింది. పొయ్యి మండుతుంది. ఎర్రని మంటలు.

* * *

ఎర్రని మంటలు. చెరుకుపిప్పి మండుతుంది.

దూరంగా ఉన్న చీకటిలో కీచురాళ్లు రొదచేస్తున్నాయి.

పైడన్న తన పెళ్లాం తీసుకు వచ్చిన చేపల పులుసుతో గంటికూడు కలుపుకొని, కడుపు నిండుగా తిన్నాడు ఆమె చీర చెంగుతో మూతి చెయ్యా తుడుచుకున్నాడు.

పైడన్న పొడవుగా ఉంటాడు. కండరాలు తిరిగిన ఉక్కు శరీరం అతనిది. కోరమీసం, ఉంగరాల జుత్తుతో అందంగా ఉంటాడు. ఒంటిమీద ఒక పంచ తప్ప, ఎలాంటి ఆచ్ఛాదనం లేదు మంటల వెలుగులో దబ్బపండు చాయలాంటి అతని శరీరం నిగనిగలాడుతోంది. రమణమ్మ మొగుణ్ని కొరికేస్తున్నట్లు చూస్తోంది.

"సీకటయ్యింది ఊరిదాకా దిగబెడతాను నడే, రవణా. !" చుట్ట వెలించి నాలుగు దమ్ములాగి అన్నాడు పైడన్న.

"ఆఁ ఆఁ నా నియ్యేళ యిక్కడే తొంగుంటాను." పైడన్న నడుంకి రెండు చేతులు బిగించి, అతని గుండెల మీద రమణమ్మ వాలిపోయింది

పైడన్న పెళ్లాన్ని మరింత దగ్గరకు లాక్కున్నాడు.

"ఎర్రిది .ఇంటికాడ పిల్లోణ్ని మరసి పోతంది."

"నా నేటి మరిసిపోనేదు ... పిల్లోడు సూరయ్య తాతకాడ తొంగున్నాడు"

ఇద్దరు మంచెమీదికి వెళ్లిపోయారు.

అవి ప్రపంచాన్ని మరిపించే క్షణాలు. ఆ క్షణాల్లో ప్రపంచాన్ని మరిచిపోయిన పిచ్చివాళ్ళు – ఒకరిలో ఒకరు కలిసి పోయారు. కాలం తెలియకుండా కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోయారు.

అంతలోనే– ఆ క్షణాలకి అవరోధం ఏర్పడింది.

ఎవరో తోటలోకి వస్తున్నట్లు చప్పుడయ్యింది.

"దొంగనాయాళ్ళు... ఎవరో వత్తున్నారే... అళ్లపని పట్టొత్తాను నువ్వు మంచె దిక్కే రవణా..."గబగబా మంచె కిందికి దిగి, కర్రతీసుకొని, తోటవేపు నడిచాడు, పైడన్న.

మంచె చీకట్లో ఉందేమో, అది ఎవరికీ కనిపించదు. మంచెమీద ఉన్న రమణమ్మకి అంతా కనిపిస్తుంది. ఎదుగుతున్న ఎర్రని మంటలు జరుగుతున్న దారుణాన్ని, హింసను జరిపిస్తున్న రాక్షసుల్ని స్పష్టంగా చూపించింది.

తోటలోకి వచ్చింది– ఆ ఊరి దొర బాబులు దొంగల్లా రాత్రివేళ కుమ్మక్కయి, గంపెడు కుళ్ళతో కుట్రతో తన పసుపూ కుంకుం తుడిచివేయడానికి వచ్చారని కాసేపట్లోనే రమణమ్మకి తెలిసి పోయింది.

మునసబు మాలచ్చిమినాయ్డు, అతనికి రెండు వేపుల– కరణం చిట్టి పంతులు, చారిక అప్పయ్య, మరో యిద్దరు దున్నపోతుల్లాంటి మనుషులు నిలబడి వున్నారు.

వాళ్లను చూసిన పైడన్న– "బావూ... తేవరాః... యియ్యేళప్పుడా.... యిక్కడికి ... నాతో ఏటి పనిమీదొచ్చారు. సెలవియ్యండి, బావూ ..." విషయం అర్థం కాక అయోమయంగా చేతులు జోడించాడు, మాలచ్చిమినాయ్డుకి.

. "నంజుకొడకా . నక్కనయాలు సూపించకురా.... ఒరే.... నానీ వూరికి సింవాన్నిరా. నా కెవుడూ ఎదురుసెప్ప కూడదు .... పరిదేసిగోడి కొడుకువి నానే సంపించిశాన్రా... అందరికీ పబ్లికుగా తెల్సు. తెల్సినా నా మీద ఎగిరిష్టుగా సాచ్చీకం యియ్యడానికి గుండె నేదు. ఈ వూరు మొత్తమ్మీద ఎవుడికీ నేదు. కానవుతే– మొనగాడు బయిలెల్లినాడండీ .... నామీదే కోర్టులో సాచ్చీకం యివ్వడానికి నంజకొడుకు తయారయి నాడండీ ...". మునసబు కళ్ళలో ఎరుపు బయట మంటతో పోటీ పడుతోంది.

తన పొలంలో పరదేశి పదిసెంట్లు మడిచెక్కను కలుపుకోవాలనే బుద్ధి పుట్టింది, మాలచ్చిమినాయ్డుకి. పాపం పరదేశి తనకున్న కాస్త నేలను మునసబుకి అడిగిన వెంటనే ఇవ్వలేదు. అది అతని బ్రతుకన్నాడు. అతని

తర్వాతి సంతతికి కూడుపెట్టే తల్లన్నాడు. ఆ తల్లిని వదులుకోలేనన్నాడు. కాదన్నందుకు పరదేశి చావుదెబ్బలు తిన్నాడు. వేడి రక్తం ఒంట్లో ఉందని, మునసబుని ఎదిరించినందుకు పరదేశి కొడుకు చావును కోరి తెచ్చుకున్నాడు.

ఆ దారుణం ఊరు ఊరంతటికీ తెలుసు కానీ, ఎవరూ కిక్కురు మన లేదు. పరదేశికి జరిగిన అన్యాయాన్ని వీధిలో గారడీని చూసినట్లు చూసి ఊరు కున్నారు. మునసబు అంటే ఎవరు? ఒక అజేయమైన శక్తి. ఆ శక్తి ఇప్పటిది కాదు. తరతరాలుగా బలిసిపోయి, పెరిగిపోయింది. డబ్బుతో, పెత్తనంతో, పెద్దరికంతో వేళ్ళుపాతుకొని, ఊడలు పరుచుకొని - ఊరు ఊరంతటినీ విస్తరించింది.

నీడను కల్పించవలసిన మర్రిచెట్టు-మల్లెతీగల్ని కబళించి, తినేస్తుంది. పరదేశి కన్నీళ్ళు చూడలేకపోయాడు, పైడన్న. న్యాయం పక్క తను నిలబడతానని, కోర్టులో నిజం చెప్తానని, అంతవరకు ఎవరికీ చెప్పొద్దని పరదేశి కన్నీళ్ళు తుడిచాడు. కానీ, ఆ కన్నీళ్ల తుడవడం ఎవరు చూశారో? మునసబు చెవిలో వేశారు.

మంచెమీద ఉన్న రమణమ్మ గుండెల్లో భయం పేరుకుంది. ఎన్నో శంకలు, ఎంతో కన్నీరు, ఏదో బలహీనత-వాటి మధ్య రమణమ్మ నలిగిపోగా - గొంతు తడారిపోయింది.


మునసబుకి పైడన్నకి మధ్య ఘర్షణ పెరిగింది. పెద్దపులులకి చిక్కిపోయిన లేడిపిల్లలా అతని పరిస్థితి తయారయింది. ఉన్నట్టుండి కరణం చాచిపెట్టి కొట్టాడు. పైడన్న చారిక కాళ్ళదగ్గర వెల్లకిలా పడ్డాడు. అప్పయ్య తన ఎడం కాలితో పైడన్న నోరు నొక్కాడు. మనిషిరూపంలో ఉన్న ఒక దున్నపోతు బండరాయి తీసి, పైడన్న గుండెలమీద గుభేలుమని గుద్దాడు.

అంతే! పైడన్న ప్రాణం కసాయి వాళ్ళ చేతుల్లో గిలగిల తన్నుకొని, అన్ని బంధాల్నీ తెంపుకొని, పంచభూతాల్లో కలిసిపోయింది రమణమ్మ తాడు తెగిపోయింది.

ఆ రాక్షస కృత్యాన్ని చూసిన రమణమ్మ నిలువునా వణికిపోయింది. నీరుకారిపోయింది. కూలిపోయింది.

మర్నాడు - తెలివివచ్చి చూసేసరికి, రమణమ్మ కళ్ళ ఎదుట ఆమె భర్త శవాన్ని పాడె ఎక్కిస్తున్నారు. పైడన్న చావుకి మునసబు కల్పించిన కట్టుకథ అందరి నోళ్ళలో వినిపిస్తుంది.

'రాత్రి తోటలోపడ్డ దొంగల్ని తరుముకొస్తున్నప్పుడు-పాపం పైడన్న కాలుజారి నేలబావిలో పడిపోయాడు. కటిక చీకటి. ఎవరూ లేరు అరచి, అరచి చచ్చిపోయాడు. పోస్టుమార్టం పేరుతో శవాన్ని డాక్టరుబాబులు పీక్కుతింటారని పోలీసులకి రిపోర్టు యివ్వకుండా,



ఏనా వాడేం కంట్రాక్టరండీ! చూడ్డానికి బ్రహ్మాండంగా వుండేలా ఇల్లుకట్టిస్తానంటే సరే నన్నాం!! ఇట్లా కొంప ముంచుతాడనుకోలేదు!

మాలచ్చిమినాయ్డు అన్నిటికీ పూను కున్నాడు.' హదన క్రియలు మంచి మనసుతో మునసబుబాబు జరిపించి నందుకు ఊరివాళ్ళంతా అతనికి చేతు లెత్తారు.

రమణమ్మ కోలుకొని, మామూలు మనిషయ్యేసరికి నాలుగు నెలలుదాటింది. పైడన్న చావుని అంతా మరిచిపోయారు. కానీ, రమణమ్మ కళ్ళలో ఆరోజు రాత్రి కిరాతకపు చర్య యింకా కదులుతూనే ఉంది. నిజం చెప్పి, అందరి ముందు మునసబుని దోషిగా నిలబెట్టాలనుకుంది. కానీ, తన మాటను ఎవరు నమ్ముతారు? నమ్మినా, మునసబుని ఎదిరించే దెవరు? అతను చేసిన ఘాతుకాన్ని తను చూసిం దని తెలిస్తే, తనను బతకనిస్తాడా? తన బిడ్డను ప్రాణాలతో విడిచిపెడతాడా? అంతలోనే భయం. ఆ భయమే ఆమెని పెదవి కదపనివ్వలేదు.

ఊరు విడిచి, తన బిడ్డతో ఎక్కడి కైనా పారిపోవాలనుకుంది. కానీ, తనకి ఎవరున్నారని, ఎక్కడకు వెళ్ళగలదు? ఎక్కడకో పారిపోయినందువల్ల తనకి కలిగే ప్రయోజనం ఏమీలేదు. పైగా దూరం, కాలం – తనలో యిప్పుడు రగులుతున్న గుండెల్ని చల్లారబెడతాయి తప్ప, మునసబుమీద పగ సాధించడానికి సాయపడవు. తన పగ తీరాలంటే– తనక్కడే ఉండాలి. ఆ దుర్మార్గుని ప్రతిరోజు చూస్తూ, తన పగను పెంచు కోవాలి. తన బిడ్డద్వారా మునసబుని సర్వనాశనం చేయాలి.

ఆ ఆలోచనలు రమణమ్మకి కొత్త ఊపిరిని యిచ్చాయి ఆ ఊరునుండి కదలనివ్వలేదు.

పది ఇళ్ళలో ఊడిగం చేస్తూ, బతుకు మీద తీపిని పెంచుకుంది. కనిపించని దేవుడ్ని ప్రతిక్షణమూ తనకు సాయం

ఉండమని కోరుకుంది. రమణమ్మ జీవితంలో నవ్వునూ, సుఖాన్ని పూర్తిగా మరిచిపోయింది.

ఏవో కారణాలు చూపించి,రమణమ్మ కున్న కాస్త మాగాణి కాజేశాడు, మాలచ్చిమినాయుడు అడపా తడపా ఆమెను అల్లరిపాలు చేశాడు. వీధిలోకి ఈడ్చాడు. మునసబు ఎన్ని చేసినా, ఎలా అవమానపరిచినా ఆమె సహించింది.

రమణమ్మ తన కొడుకు చంద్రంను పట్నం కాలేజీ చదువుకి పంపించినప్పుడు - ఊళ్ళో పెద్దలంతా బాధపడిపోయారు. ఆఫ్టరాల్ అంట్లు తోముకునే రమణమ్మ తన కొడుక్కి కాలేజీ చదువు చెప్పించటమా? 'అది అంట్లు తోముకు బతికితే, దాని కొడుకు పొలం దున్నుకు బతకటం న్యాయం' అన్నారు. వాళ్ళ సంస్కృతి మీద, సభ్యతమీద పరుచుకున్న జిలతారు ముసుగులు చిరిగిపోతున్నట్లు బాధపడిపోయారు. అందరూ వద్దన్నారు. ఆమెని వారించబోయారు. వాళ్ళందరి 'బాధ' వెనుక మునసబుబాబు 'చెయ్యి' ఉందని ఆమె గ్రహించంకపోలేదు.

రమణమ్మ ఎవర్నీ లెక్కచేయలేదు.

"అడముండ.... దానికేటి తెల్పు పెద్ద సదువుల సంగతి. అస్సలు కాలీజు సదవులంటే ఏటీ, దానికెంత కర్సవుద్దో తెలియాల.... ఏడాది తిరగనియ్, ఇది దబ్బందియ్యనేక కాళ్ళ తేలేస్తది. అదు ఎనక్కితిరిగెలి పోస్తాడు .... అడముండ మన మాట యినకుంటాదా?" రమణమ్మను చూసి, పది మందితో తన గుమ్మంలో కచేరి సాగిస్తున్న మునసబు అవహేళనగా మాట్లాడే సరికి - ఆమెకి నరనరాన పట్టుదల పెరిగింది. ద్వేషం, పగ ఒళ్లంతా చోటుచేసుకున్నాయి.

రమణమ్మ చితికిపోయిన వ్యక్తి కావచ్చు. మురికితో బతుకుతున్న మనిషి కావచ్చు. భాష రాకపోవచ్చు. డబ్బు లేకపోవచ్చు. కానీ ఆమెకు మనసుంది. ఆ మనసులో బాధ ఉంది భావం ఉంది. అన్యాయాన్ని ఎదుర్కోవాలనే ఆవేశం ఉంది. అందుకే చంద్రంకోసం, చంద్రం చదువుకోసం, చంద్రం భవిష్యత్తుకోసం, మునసబుకి బుద్ధి చెప్పడకోసం- రమణమ్మ ఒక్క క్షణాన్నికూడా ఊరికే పోనివ్వలేదు.

ఆమె వయస్సునీ, బాధ్యతనీ, బరువునీ పెంచేస్తూ- కాలం ముందుకి సాగిపోయింది.

రమణమ్మ ఆశించినట్లుగా చంద్రం ప్రయోజకుడై వస్తున్నాడు. మామూలుగా చదువుకొని రావడంలేదు తన ఊరికి పెద్ద పదవితో వస్తున్నాడు. మునసబు, కరణం, పెద్దమనుషులెవరైనా సరే తన కొడుక్కి వంగి సలాములు చేయాలి. చంద్రం చెప్పినట్లు వినాలి. ఇన్నాళ్ళు తనలో రగులుతున్న ద్వేషం,

పగ చల్లార్చుకోవాలి. చంద్రంకి అతని తండ్రి చావుగురించి తెలియాలి. ఆ చావుకి కారణం అయిన మాలచ్చిమి నాయ్డు మీద పగ తీర్చుకోవాలి.

రమణమ్మలో పగ బుసలు కొడుతోంది.

పొయ్యిమీద అన్నం కుతకుత ఉడుకుతూ, పొంగి బయటకు పొర్లిపోతూ ఉంటే - గతంనుండి బయటపడింది, రమణమ్మ.

బాగా పొద్దుపోయింది.

ఆ రోజే చంద్రం వచ్చాడు. ఇంటి ముందు ఠీవిగా నిలుచున్న కొడుకుని చూసి, రమణమ్మ గుండె తృప్తితో బరువయింది. సజల నయనాలతో కొడుకుని ఆపాదమస్తకం పరీక్షగా చూసించి. ఆమె ముందు-ఓ పెద్ద కొండ, ఆ కొండ మీద ఓ దేవుడు, ఆ దేవుడుచుట్టూ వెలుగు కిరణాలు నిలిచినట్లు, కనిపించినట్లు, దారి చూపిస్తున్నట్లుగా రమణమ్మ ఊహించుకుంది.

"బాపూ...." అంటూ ఏడ్చింది. తల్లి కన్నీరు తుడిచి, ఇంట్లోకి దారి తీశాడు, చంద్రం.

చంద్రం పట్నం చదువుకోసం వెళ్ళి, ఆరేళ్ళయింది. ఇంతకాలం హాస్టల్లోనే ఉన్నాడు ఈ ఆరేళ్ళలో ఒక్కసారి కూడా ఊరు రాలేదు. కాదు- అసలు చంద్రాన్ని రమణమ్మే రానివ్వలేదు.

చంద్రలో కొట్టవచ్చినట్లు మార్పు కనిపిస్తుంది. మునసబు మాలచ్చిమినాయ్డు కన్న ఎంతో గొప్పగా ఎదిగినట్లున్నాడు. మునసబుకి చదువులేదు. నాగరికతలేదు. సంస్కారంలేదు. మనసు లేదు ఇంకా ఎన్నెన్నో లేవు. అవన్నీ చంద్రంలో ఉన్నట్టు కనిపించాయి, రమణమ్మకి. రాత్రి చేపలపులుసు, వరన్నం కలిపి, కొడుకుచేత కొసరి కొసరి తినిపించింది. పట్నంలోని వింతలు, తన చదువు విషయాలు, ఆరేళ్ళ కబుర్లు కొడుకు చెబుతుంటే- ఆ తల్లి హృదయం ఆనందంతో ఉరకలు వేసింది. ఆమె కష్టాల్ని బాధల్ని మరిచిపోయింది.

* * *

మకుటంలేని మహారాజులా వెలిగిపోతున్న మాలచ్చిమినాయ్డుకి - తన హోదాకి తలవంపులు తెచ్చేపని తన కూతురు చేస్తుందని తెలిసి, తల పట్టుకున్నాడు. ఇది మామూలు తలనొప్పి కాదు, మందు రుద్దుకుంటే పోవడానికి. తలవని తలంపుగా వచ్చిన తలవంపుల తలనొప్పి. చాలా పెద్ద సమస్య మాలచ్చిమినాయ్డుని నిన్న రాత్రి నుండి బాధ పెడుతోంది ఆ సమస్యని పరిష్కరించే మంచి మందు కావాలి.

అసలు మాలచ్చిమినాయ్డుగార్కి అమ్మాయి తెచ్చిన తలవంపు పని ఏమిటంటే?

రత్నం లాంటి ఆ అమ్మాయి పేరు

రత్నం. డింకీలు కొట్టకుండా క్లాసులన్నీ వరసగా ప్యాసయిపోతుందని-పట్నంలో ఉన్న వాళ్ల బాబాయిగారింట్లో ఉంచి, కూతురికి కాలేజీ చదువు చెప్పించాడు, మూలచ్చిమినాయ్డు. కాలేజీలో చేరేసరికి రత్నానికి ప్రేమాయణం పారాయణం చేసే వయసు వచ్చింది. ఆ వయసు తిన్నగా ఆ అమ్మాయిని తీసుకొని ఓ అందమైన అబ్బాయిని చూపించింది. ఆ అబ్బాయి రత్నం చదువుకుంటున్న కాలేజీ లోనే చదువుకుంటున్నాడు, ఆమె ఉంటున్న ఊరిలో నివాసం ఉంటున్న వాడు, అందమైన కొంటెవాడు అనిపించు కుంటున్నవాడు, అన్నింటా ఫస్టుగా ఉంటున్నవాడు. రత్నానికి అంతస్తూ, ఆస్తీ అనే పదానికి అర్థాలు పూర్తిగా తెలియవు గనుక అమాంతం చంద్రాన్ని ప్రేమించింది.

అందమైన కన్నెపిల్ల. మునసబుగారి గారాలపట్టి. ఆమె మారాం చేస్తుంటే తను ప్రేమించకుండా ఎలా ఉండగలడు? కలక్టరుగారి కూతురికైనా, కసాయివాడి కూతురికైనా ప్రేమ ఒకలాంటిదే. అది కాదంటే నేరం అవుతుంది. అన్యాయం అనిపిస్తుంది. అందుకే- చంద్రం మున సబుగారి కూతురి ప్రేమను అంగీకరిం చాడు. ఆ ప్రేమకోసం ఎలాంటి త్యాగ మయినా చేయడానికి నిర్ణయించుకున్నాడు.

మొన్నటి వరకు వాళ్లిద్దరి మధ్య ప్రేమకథ ఎవరికీ తెలీదు. నిన్న సాయం త్రము మామిడి తోపులో చెట్టుకొమ్మ మీద చెట్టాపట్టా లేసుకొని, ప్రేమ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్లిద్దర్నీ చారిక అప్పయ్య కనిపెట్టాడు. అర్జంటుగా మునసబుగార్ని లాక్కొచ్చి, ఆ యిన్ వెన్షన్‌ని చూపించాడు.

అప్పట్నుంచి మూలచ్చిమినాయ్డుకి తలవంపుల తలనొప్పి పట్టుకుంది. బాగా కింద గొడ్లపాకలో ఉండవలసిన చంద్రతో-అంతస్తూ, హోదా, పలుకుబడి గల తన కూతురు ప్రేమను ఎలా అంగీ కరించడం? రత్నం ప్రేమను కాదంటే? చంద్రాన్ని అడ్డు తొలగిస్తే? ఇంకేదైనా చేస్తే? ఇలాంటి ప్రశ్నలు ఎన్నో మున సబుగారి బి. పి. ని పెంచాయి తప్ప సమస్యను పరిష్కరించే మంచి సమా ధానం ఒకటీ ఆ ముసలి బుర్రలోకి రాలేదు.

ఆ కుటిలమైన సమస్యని పరిష్క రించడానికి - కరణం చిట్టిపంతుల్ని ఒక సారి రమ్మని చారికప్పయ్యతో కబురు చేశాడు, మునసబు మూలచ్చిమినాయ్డు.

"ఏం విటండీ, తలవంపులు తెచ్చే పని? ఒహరకంగా చెప్పాలంటే, మన అమ్మాయి చాలా మంచి పని చేసిందం టాను." విజమైన మంత్రివరేణ్యుడిలా మాట్లాడేడు, చిట్టిపంతులు.

మూలచ్చిమినాయ్డు నొసలు చిట్లించాడు.

"ఎలా అంటారా?.... మీకు వయసు

పెరిగింది! రక్తం పలచబడింది. అంటే, మీ ఆలోచనలు తగ్గాయి. వాడుకున్నంత కాలమూ మీ బుర్రలో ఆలోచనలు వాడుకున్నారు. ఇప్పుడు వాడుకోవడానికి అక్కడ ఆలోచనలు మిగల్లేదు.... మరి, చంద్రం? ఉరకలువేస్తున్న వయసు. కొత్త రక్తం కొత్త ఆలోచనలు, పైగా ప్రభుత్వం మనిషి. ఆ మనిషి మీ చేతుల్లో ఉంటే ప్రభుత్వం మీ చేతుల్లో ఉన్నట్లే లెక్క. మీరు చెసే ప్రతి మాంఛి పనికి అతను అల్లుడుగా మీకు అవసరం పడతాడు. కట్నం కానుకలు యివ్వ నక్కర్లేదు. మీ యింట్లో మీ కుక్కలా పడిఉంటాడు. మీ చెప్పులు తొడుక్కున్నందుకు, మీ చేతల్లో తోడుగాఉంటాడు. ఇద్దరికీ పెళ్లిచేస్తే, అన్ని రకాలుగా మీరు లాభం పొందుతారు. కాదనకండి"

కరణంగారి ఆలోచన బుర్రలోకి ఎక్కించుకొనేసరికి - మాలచ్చిమి నాయ్డుకి మూడు లంక చుట్టలు అవసరం అయ్యాయి. వెధవది చుట్టలు ఖర్చయితే పోయాయిగాని- చిట్టిపంతులు యిచ్చిన సలహా బాగానే ఉన్నట్లుగా తోచింది. ఆరోజు కోర్టులో తనకి వ్యతిరేకంగా సాక్ష్యంయిస్తాడని తెలిసి, పైడన్నని 'పైకి' పంపించక తప్పలేదు అది తప్ప, ఆ ఇంటితో తనకి ప్రత్యేకమైన విరుద్ధం ఏమీ లేదు. తనకి కావలసింది ఒక మైనపుముద్ద.

"సూడు, పంతులూ!.... ఇయ్యేల నానీమాట యినుకుంటాను గాని నానెళ్లి ఆ బికారి మనిసితో- నీ కొడుక్కి- నా కూతుర్నిస్తన్నాను. ఏటంటా' వని అడగలేను. అదేదో నువ్వే చూడు. ఆ పెంద్రాన్ని మవింటికి ఎలిపొచ్చేమని సెప్పు. పెళ్ళేదో మనవే కానిద్దాం." తను చాలా పెద్ద త్యాగం చేస్తున్నాడు. ప్రపంచంలో ఏ అమాయకుడు తనలాగ ఒక బీవార్పుగాడికి అన్ని విలువలున్న బంగారు లాంటి కూతుర్ని యివ్వడు. ఇచ్చి ఉండడు. ముందు ముందు యివ్వేదు కూడ. ఏటో కొన్ని సమయాల్లో నాకు మనసు మెత్తబడి నా మాటే యినిపించుకోదు' మాలచ్చిమినాయుడు స్వగతంలో అనుకున్నాడు

గొప్ప త్యాగశీలిలా పోజు పెట్టి, బరువుగా అడుగులు వేసుకుంటూ కూతురి గదిలోకి వెళ్లిపోయాడు.

* * *

చంద్రం బి.డి.ఓ.గా ఛార్జి తీసుకున్నాడు.

అది తను పుట్టి, పెరిగిన ఊరు. అయినప్పటికీ - ఆ ఊరు తన కంటికి కొత్తగా కనిపిస్తోంది ఎన్నో మార్పులు తీసుకురావాలని, మనుషుల్లో చైతన్యం కలిగించాలని, పల్లెలో ప్రగతిని సాధించాలనీ తపన అతనిలో లేకపోలేదు.

మునసబుగారు, కరణంగారు, పెద్ద లనిపించుకొనేవాళ్ళు అంతా తనని చాలా గౌరవంగా చూస్తున్నారు. అభిమానిస్తు

న్నారు. వాళ్ళింట్లో జరిగే విందులకు వినోదాలకి తనను సాదరంగా అహ్వానిస్తున్నారు। అటువంటి సుఖం అంతకు ముందెన్నడూ తన జీవితంలో అనుభవం లోకి రాలేదు. రత్నంను పెళ్ళిచేసుకోమని మాలచ్చిమినాయుడుగారు అడిగారు. అదృష్టం అంతా తన ఒక్కడిదే అనిపించింది, చంద్రంకి.

చంద్రం ఉద్యోగంలో చేరి నెల రోజులు దాటింది. ఇరవైనాలుగ్గంటలూ ఆఫీసు వ్యవహారాలూ అంటూ తిరగడంతోనే సరిపోతుంది వేళకి తిండీ, నిద్రా కూడ కరువైపోతున్నాయని బాధపడింది, పిచ్చితల్లి. ఒకరోజు - పుస్తకాలు ముందేసుకొని తీవ్రంగా ఆలోచిస్తున్న చంద్రంతో తన మనసులో బాధాగాథ చెప్పుకోవాలని ఆ పిచ్చితల్లి ఆశపడింది.

ఆ సమయంలో తల్లికి అవకాశం యివ్వకుండా - "అమ్మా! నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను." అన్నాడు, చంద్రం. అతను చెప్పే విషయం తన గుండెల్ని రంపపుకోత పెడుతుందని రమణమ్మ ఊహించలేదు.

"అమ్మా! నేనూ, రత్నమూ కాలేజీలో చదువుకుంటున్నప్పట్నుంచి ప్రేమించుకుంటున్నాం. మా పెళ్ళికి మునసబుగారు యిష్టపడ్డారు. తొందరలో శుభకార్యం జరిపిస్తామంటున్నారు. ఈ విషయం నీతో చాలా రోజులుగా చెప్పాలనుకున్నప్పటికీ, ఎందుకో చెప్పలేకపోయాను." చాలా క్లుప్తంగా, సాధారణంగా చంద్రం చెప్పాడు.

రమణమ్మ నిర్ఘాంతపోయింది. కాసేపటివరకు ఆమెకి నోట మాట రాలేదు. 'అలస్యం చేయకూడదు. జరిగినదంతా చెప్పాల'నుకుంది. ఆ అసుర సంధ్యవేళ అతని తండ్రిని మునసబు ఎలా హత్యచేసిందీ వినిపించింది. అటువంటి దుర్మార్గుడితో చేతులు కలపవద్దు అంది. అతని తండ్రిని దూరంచేసిన మాలచ్చిమినాయుని సర్వనాశనం చేస్తేగాని తన పగ చల్లారదని చెప్పింది. తన అనుభవించిన ప్రతి అవమానమూ అవహేళనా తిప్పికొట్టమంది. ఆ తర్వాతే రత్నంను పెళ్ళిచేసుకోమంది.

కానీ, చంద్రం?....

సినిమా హీరోలా తన తల్లి చెప్పిన విషయాలకి ఊగిపోయి, తన ప్రేమను త్యాగంచేసి, తనలో ద్వేషమూ పగా పెంచుకొని, తన తండ్రిని కడతేర్చిన హంతకుణ్ణి చంపడానికి సిద్ధపడి, చంద్రం మునసబు యింటివేపు పరుగుతీయలేదు. తల్లి మాటలకి నవ్వేడు. ఆ నవ్వులో ఎలాంటి బాధాలేదు. ఆమె మాటల్ని తేలిగ్గా తీసిపారేస్తున్నట్లుగా ఉంది.

"అమ్మా.... ఈ మురికిలో బతకడం నీకు యిష్టంగా ఉండొచ్చు. కానీ, నాకు చేతకాదు. తన కూతురు నన్ను ప్రేమించిన నేరానికి మునసబుగారు నన్ను అల్లుడుగా కోరుకుంటున్నారు గాని- నేను

ఎన్ని జన్మలెత్తినా అంత ఎత్తుకి ఎదగ లేను. నా అదృష్టాన్ని చూసి, నువ్వు సంతోషించాలి. అంతేగాని ఏవో కట్టు కథలు చెప్పి, ఈ చీకటిలో నన్ను కట్టి పడెయ్యాలని చూడకు. అసలు నాన్న ఎలా చచ్చిపోయాడో ఊళ్ళో అందరికీ తెలుసు... పోనీ, నువ్వు చెప్పినట్లు మునసబుగారే నాన్నని చంపించారే అనుకుందాం. హింసను హింసతో సాధించమంటావా? ఆరోజు అతను చేసిన నేరానికి పశ్చాత్తాపపడి, ఆ తప్పును దిద్దుకోవడంకోసమే ఈరోజు మంచిపని చేస్తున్నారని ఎందుకనుకో కూడదు? నువ్వు ఎన్ని చెప్పినా, నేను నమ్మను. మునసబుగారిమీద నాకు నమ్మకం ఉంది. అంతకు మించిన అభిమానం ఉంది" చంద్రం మాటల్లో - రత్నాన్ని పెళ్ళిచేసుకొనే మాటటుంచి, మాలచ్చిమినాయ్డు గొప్పదనమే ఎక్కువగా వినిపించింది. ఎదిగున్న కొడుకు, ఏదో చేస్తాడనుకున్న కొడుకు ఎంతో తెలివిగా మాట్లాడుతున్నాడు. కన్నతల్లినే నమ్మలేకపోతున్నాడు

ఆ మాటలు విన్న తర్వాత - ఇంత కాలం తను బ్రతికి ఉండటం వృథా అనిపించింది, రమణమ్మకి. ఎవరిమీద తను పగ సాధించాలనుకున్నదో వాళ్ళ పక్షంలోకి చంద్రం చేరిపోయాడు. తన చెయ్యి జారిపోయి, అందనంత దూరం జరిగిపోయాడు.

ఆరోజు తన భర్త చావు. ఈరోజు తన కొడుకు పెళ్ళి - రెండూ మునసబు బాబే జరిపిస్తున్నాడు. అతని ఉదారతను, దొడ్డబుద్ధిని పదిమంది గొప్పగా చెప్పు కుంటున్నారు. కానీ, రంగు తెరల్ని దించి, వెనుక ఏ విషసర్పాలు దాగి ఉన్నాయో అవి ఎవరూ చూడరెందుకు? చివరికి తన కొడుకు కూడా ప్రయత్నించ డేమి?

మూగవేదన, ఇగిరిపోని కన్నీరు, ఎవరూ ఓదార్చలేని దుఃఖం-అంతకన్నా రమణమ్మకి ఏమీ మిగల్లేదు!

* * *

మునసబు మాలచ్చిమినాయ్డు- బ్రహ్మాండంగా పెళ్ళి జరిపించాడు. ఊళ్లో కన్నులపండుగ. ముత్యాలపల్లకిలో, మంగళవాయిద్యాలతో, సకల సకుటుంబ బంధుమిత్ర సపరివారంతో వధూవరుల్ని ఊరంతా ఊరేగించారు. రాములవారి గుడి దగ్గర పల్లకి దించి, నవదంపతుల చేత సీతారాములుకి దణ్ణం పెట్టించారు.

అప్పుడు-

మసిబారిన పూరిపాకలో, మట్టికంపు. కొడ్తున్న నేలమీద, చీకటిలో, ఒంటరిగా రమణమ్మ గుండెలు తరుక్కుపోయేలా, వెర్రి వెర్రిగా ఏడుస్తోంది. ఆ ఏడుపు ఎవరికీ వినిపించడంలేదు. బహుశా, మీద ఉన్న దేవుడికి వినిపిస్తుంది కాబోలు.

"దేవుడా....నువ్వు మంచోడి వనుకు

న్నాను. నాకు మేలు సేత్తావనుకున్నాను. నీలో యింత కపటం ఉందని కానుకోనేకపోయేను....నువ్వో సుట్టు మడిసి జల్మ ఎత్తి కిందికి రా. నిన్నూ మునిసేబు సంపేస్తే, నీ పెళ్లాం తాడూ తెగిపోతే - నా బాదేటో, నా కంట్లో కారేది రగతం అవునో కాదో తెలస్తాది.

"సావకే, ఎర్రిదానా అన్జెప్పి - నాకు కొడుకు నిచ్చావు. అణ్ణి పెంచి, పెద్దోణ్ణి సేసి-మునిసిబుమీద పగదీసుకోమని అస్సాపించేవుగాని మళ్ళిదేటి? నా కొడుక్కి ఆ మునిసీబు కూతురుతోటే దారం కలుపుతావా? అల్లిద్దరికీ పెళ్ళి ముడెడతావా? అళ్ళ పక్కనే నువ్వు సేరిపోతావా? కానా గొప్పోడివయ్యా. నాలాటి దయిద్రిగొట్టోలంటే నీకెంత కోపంవో నాకిప్పొద్దే తెలిసింది....

"మునిసిబులాటి మారాజుల్ని మా పక్కగా సూసుకుంటావు. అళ్ళకి దబ్బిస్తావు. దసక్కం యిస్తావు. ఇల్లిస్తావు. వాకిలిస్తావు. పొలంవిస్తావు. పొగురు ఇస్తావు. అన్నేయాలు సేయడానికి కావాల్సినంత దయిరం యిస్తావు. మాలాటోల్ని దోసుకు తినే మాటకారి తనంవు యిస్తావు. మరి మాకో?.... ఆకలిస్తావు. సీకటిస్తావు. ఏడుపిస్తావు. మట్టిస్తావు. గుండెకోత యిస్తావు. అన్నేయాల్ని సూస్తూ ఒల్లకోడానికి ఎర్రి సూపులిస్తావు. మమ్మల్ని పీక్కుతినే పెద్దోలు కాడ తలొంచుకొనే పేతకాని తనంవు యిస్తావు. అంతే .... అంతే యిస్తావు. నిన్ను నమ్ముకోడం నాదే బుద్ధి తక్కువ. దేవుడా! మరి నిన్ను నమ్మను. నమ్మను గాక నమ్మను."

* * *

మర్నాడు - చంద్రం సూరయ్య తాత ద్వారా తల్లికి కబురుచేశాడు, కొత్త కోడలిని చూసివెళ్ళమని. బొట్టు లేకపోవడంవలన రమణమ్మ కొడుకు పెళ్ళికి రాలేదనుకుంటున్నాడు గాని ఆ కన్నతల్లినే చంద్రం మోసంచేశాడని మాత్రం సూరయ్యతాతకి తెలీదు. అందుకే తాత వడివడిగా నడిచివచ్చాడు. అద్దాలమేడలో నవవధువుతో మెరిసిపోతున్న చంద్రాన్ని రమణమ్మకి చూపించాలని.

కానీ ఆ పిచ్చితల్లి యింట్లో కనిపించలేదు.

ఆమె ఎక్కడకు వెళ్ళిందో ఎవరికీ తెలీదు.

అసలు ఆమె ఎక్కడికి వెళుతుందో ఆమెకే సరిగ్గా తెలీదు.